క్లుప్తంగా

నకిలీ పై నిఘా పెట్టాలి

ఏటూరునాగారం: జిల్లాలో నకిలీ విత్తనాల రవాణాపై వ్యవసాయశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా పెట్టాలని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలోని రైతులు మిర్చి, వరి, పత్తి, వేరుశనగ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నాయని, రైతులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి పంటసాగు చేసే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, నకిలీ విత్తనాల రవాణాను అడ్డుకోవాలని అధికారులను కోరారు. వ్యవసాయశాఖ, టాస్క్ ఫోర్స్ బృందాలు నిఘా పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో రఘు, నర్సింగరావు, ఆయూబ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తుమికి వెంకటేశ్వరరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ, బీపీసీ, హెచ్‌ఈసీ, ఏసీటీ (ఒకేషనల్) విభాగాల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని వెల్లడించారు. అందుకు గాను పదోతరగతిలో జీపీఏ 8వచ్చిన ఎస్టీ బాలురు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా స్పోర్ట్స్ కళాశాలలో హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల్లో కూడా కొన్ని సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటికి జీపీఏ 7 వచ్చిన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టీసీ, స్టడీ, కులధృవీకరణ, మెమో, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు. మూడు జతల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని ఆయన కోరారు. ఇందులో సీట్లు పూర్తయ్యే వరకు కౌన్సిలింగ్ ఉంటుందని సూచించారు.

ఆదివాసీలకు న్యాయం చేయాలి

వెంకటాపురం(కె): మంగపేట మండలంలో 75 సంవత్సరాలుగా నివసిస్తూ భూములు, ఉద్యోగాలు కోల్పోయిన ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ నవనిర్మాణసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి బుధవారం ప్రకటనలో కోరారు. 75 సంవత్సరాల పోరాటం అనంతరం హైకోర్టు అడవి బిడ్డలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షించదగిన విషయం అన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం



ఏటూరునాగారం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అఫ్జల్ పాషా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రెస్‌క్లబ్ స్థలాన్ని ప్రెస్‌క్లబ్ స్థలాన్ని సాధించామన్నారు. రాబోయే రోజుల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం పొందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫలాలు, హక్కుల సాధనకై ఐక్యంగా ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాజేష్, శేఖర్, రవి, ముంద్రాతి సాయి, వసంతర రమేష్, తోట తిరుమల్, పర్వతాల లాలయ్య, బోడ సత్యం, ఇర్సవడ్ల భిక్షపతి, వెంకటేశ్వర్లు, లకుమయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, రవి, శ్రీనివాస్, సందీప్, శేరి శ్రీనివాస్, ఎగ్గడి రవి, పిట్టల శివ, గంజి రమేష్, ఉదయ్, ఠాగూర్, మాదరి సురేష్, అలువాల శ్రీనివాస్, బొలసాని గౌరిశంకర్, రాజ్‌కుమార్, క్రాంతి, గోవర్ధన్, రవితేజ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బొగ్గులపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం మండల స్పెషల్‌ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గర్భిణులకు అందించాల్సిన పోషకాహారాలు మెనూ ప్రకారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూలం మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, ఆయాలు ఉన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

చిట్యాల: రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్ వాడీ సెంటర్‌లో చేర్పించాలని సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని నవాబుపేటలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రదతోపాటు సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ ఇంటింటికీ తిరిగి పది మంది పిల్లలను అంగన్‌వాడీలో నమోదు చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పుతూ పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందజేస్తామని చెప్పారు. చిన్నారులకు పోషకాహారలోపం రాకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుంటామన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు క్రీడా పోటీలు



పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు



విద్యార్థుల బరువు, ఎత్తును చూస్తున్న పీడీలు, కోచ్

ఏటూరునాగారం: రాష్ట్రంలోని వివిధ క్రీడా పాఠశాలలో 4వ, 5వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించేందుకు మండలాల వారీగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోచ్ పర్వతాలు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం తొమ్మిది ఈవెంట్స్‌లలో పోటీలు నిర్వహించగా వందమంది బాల, బాలికలు హాజరైనట్లు తెలిపారు. బరువు, ఎత్తు, 30 మీటర్ల పరుగు, సెటిల్ రన్, మెడిషన్ బాల్‌త్రో, స్టాడింగ్ బ్రాండ్ జంప్, వర్టికల్ హై జంప్, 800ల మీటర్ల పరుగు పందెం, ఫెక్సిబులిటి ఈవెంట్స్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. ఈ క్రీడా ఎంపికలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా కేంద్రంలో ఈనెల 9వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు జరిగే జిల్లా స్థాయి ఎంపికల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్టేట్ లెవల్ పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. అందులో ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్రంలోని వివిధ క్రీడా పాఠశాలలో 4వ, 5వ తరగతుల్లో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు శ్యామలత, రవి, అవంతిక, వెంకటేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థిని

'అన్నదానం' నిర్వహణకు నగదు విరాళం



ఆలయ సిబ్బందికి నగదు అందజేస్తున్న భక్తులు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వంశీకృష్ణ, గాయత్రి దంపతులు రూ. లక్ష రపాయల విరాళాన్ని బుధవారం అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతికి చెందిన కాందూరి శ్రీనివాసరామనుజం యూఎస్‌లో స్థిరపడ్డారు. కాగా అతని తల్లిదండ్రులు వంశీకృష్ణ, గాయత్రి దంపతులు బుధవారం స్వామివారిని దర్శించుకుని నగదును అందించారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ

వరంగల్ పట్టణంలోని శివనగర్‌కు చెందిన బళ్ల అయిలయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాజమ్మ 04 సీలింగ్ ఫ్యాన్లను ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్యకు అందించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గిరిజనేతరులకు హక్కు పత్రాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మంగపేట: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో పాటు పూర్వం నుంచి కలిసి ఉండి పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతులకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపేటలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్ అధ్యక్షతన బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సీతక్క పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలను అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ 2006 సంవత్సరంలోనే అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసిందని గుర్తు చేశారు. గిరిజనులతో కలిసిమెలిసి ఉంటున్న గిరిజనేతరులు పోడు సాగుచేస్తున్నారని వారికి కూడా హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టా ఉన్న రైతులకు మాదిరిగానే కౌలు రైతుకు కూడా రైతుబంధు వర్తింప చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ లాల్, మండల నాయకులు మల్లయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, బుచ్చిరెడ్డి, పోట్లూర సమ్మయ్య, పవన్, రాంరెడ్డి, రాఘవరెడ్డి, రాజారత్నం, హన్మంతరావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం, మంగపేట. పొదుమూరులోని గోదావరి వరద ముంపు ప్రాంతాలను ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. వరద ముంపు ప్రాంతాల్లో రెండో విడత ప్యాకేజీ ఫ్లడ్ బ్యాంక్ నిధులతో చేపట్టనున్న పనుల ప్రాంతాలను క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఇరిగేషన్ సీఈ విజయ్‌భాస్కర్‌లు ఫీల్డ్ స్టాఫ్‌తో కలిసి పరిశీలించారు. 2007 సంవత్సరంలో చేపట్టిన ప్యాకేజీ టూ పనులు పెండింగ్‌లో ఉండగా వాటిని పరిశీలించినట్లు తెలిపారు. మండలంలో వరద ముంపుకు గురవుతున్న అవసరమైన ప్రాంతాల్లో కరకట్ట పనులు చేపట్టే ప్రాంతాలను సర్వే చేశామన్నారు. ఆయా పనులను చేపట్టేందుకు నివేదికలు పంపించాలని అధికారులకు ఆదేశించారు. వారి వెంట ఎస్ఈ మోహన్‌రావు, ఈఈ జగదీష్, ఏఈఈ వలీమ్‌మహ్మద్ తదితరులు ఉన్నారు.

'ప్రైవేట్' ఫీజులను నియంత్రించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించి డీఈఓ రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసఫ్ మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యాసంస్థల్లో విద్యను వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారని, పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్ట్‌లు అమ్ముతున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జుబేర్, రమేష్, వైష్ణవి, సుష్మిత, రేష్మ, సౌజన్య పాల్గొన్నారు.

చేయూతనిచ్చిన మిత్రులు

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామానికి చెందిన తనుకు వికాస్ అప్పుల బాధతో ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనితో చదువుకున్న మిత్రులు చేయూతనిచ్చారు. తలోకొంత పోగుచేసి రూ.25వేలు బుధవారం వికాస్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రబృందం సతీష్, రాజేందర్, రాజు, సురేష్, కుమార్, మధుకర్, రవి, స్వాతి, వసంత, సంధ్య, సుమలత, దేవేంద్ర, సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దూడ మృతి

కాటారం: మండలంలోని విలాసాగర్‌లో విద్యుదాఘాతంతో రైతు పెద్దపల్లి రాజయ్యకు చెందిన గేదె దూడ బుధవారం మృతి చెందింది. బాధితుడు రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం మేత కోసం వెళ్లిన గేదె దూడ ప్రమాదవశాత్తు ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం ఎర్త్‌వైర్‌కు తాకింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు రాజయ్య పేర్కొన్నారు. గేదె దూడ విలువ రూ.20వేల వరకు ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

గ్రామకమిటీ ఎన్నిక

కాటారం: యూత్ కాంగ్రెస్ కొత్తపల్లి గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య తెలిపారు. అధ్యక్షుడిగా చిలుముల అశోక్, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, కేశవ్, ఇమ్రాన్, రాజబాబు, రజనీకాంత్, మనోహర్, శేఖర్, రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారులుగా స్వామి, ఎలుక స్వామి, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. నూతన కమిటీకి నియామకపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆజ్మీరా రఘురాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజయ్ తొలగింపుతో రాజీనామా..!

టేకుమట్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షపదవి నుంచి బండి సంజయ్‌ను తప్పించడంతో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దావు రఘు బుధవారం తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజే పీ బలోపేతానికి కృషి చేసిన బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని నిరసిస్తూ జిల్లా ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర, మధ్యంతర ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన నాయకుడిని తొలగించడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిల్షాద్, శివకృష్ణ మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులను శాపంగా మారిన సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులను శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని ఈ అసెంబ్లీ రద్దయ్యే లోపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న జోగులాంబ గద్వాల జిల్లా నుంచి యాత్ర ప్రారంభమై 22న భూపాలపల్లికి చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రకు ఉద్యోగులందరు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, యూనియన్ నాయకులు మధుసూదన్, శ్రీనివాస్, వాణి, శంకర్, స్వామి, రాజేష్, కిరణ్మహి, రామయ్యలు పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

టేకుమట్ల(రేగొండ): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పై అభిమానంతో జిల్లా బీఆర్ఎస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొట్ల రవి సామ్రాట్ రాసిన పాటల సీడీని బుధవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

పేదోళ్ల కడుపు కొడుతున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను ఆకాశాన్నంటించి పేదోళ్ల కడుపులు కొడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుపేదలు మూడు పూటల భోజనం చేసే పరిస్థితి లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయని, వాటిని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలతో నిరుపేద కుటుంబాలు సతమతమవుతున్నారని అన్నారు. టమాటా, చికెన్, మటన్‌ల ధరలు మండిపోతున్నాయని అన్నారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ శ్రీలత దేవేందర్, ఖలీల్, నర్సింహరావు, చిన్న ఎల్లయ్య, కర్ల అరుణ, ముక్కెర లాలయ్య, పోషయ్య, శ్రీను, గౌస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని నాయకులగూడెం సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ పాయం రమణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిడెం యామిలి, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి పిళ్ళారి శెట్టి మురళి, జాగ శివాజీ, వార్డు సభ్యులు కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలు చట్టవ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సీఐ శివప్రసాద్ అన్నారు. మండలంలోని పెంకవాగులో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడే మావోయిస్టులకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సహాయ సహకారాలు అందించేందుకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని ఆశన్నగూడెం ఎల్లాపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తోలెం రవికుమార్ పై దాడికి పాల్పడిన మెస్సు శివకుమార్ పై కఠిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో సదరు వ్యక్తి వంట పాత్రలను లాక్కొని కిందపడేయటంతో పాటు ఉపాధ్యాయుడిని అకారణంగా దుర్భాషలాడుతూ హాజరు రిజిస్టర్ చించేసీ దాడికి పాల్పడ్డారని తెలిపారు. గ్రామస్తులు సముదాయించినా వినకుండా ఉపాధ్యాయుని పై దాడి చేసాడని, అతని పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఫణికుమార్, నాగేశ్వర్‌రావు, హన్మంతు, బుచ్చయ్య, లింగయ్యలు ఉన్నారు.

'పెసా' గ్రామసభలు నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

వెంకటాపురం(కె): పెసా క్లస్టర్ ప్రకారం గిరిజన ఇసుక కార్వీల గ్రామసభలను నిర్వహించాలని తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు అన్నారు. పూజారిగూడెం గ్రామసభ నిర్వహించాలని కోరుతూ బుధవారం కొమ్మలమ్మ గిరిజన ఇసుక సొసైటీ సభ్యులతో కలిసి తహసీల్దార్ అంటి నాగరాజుకు వినతిపత్రం అందించారు. పెసా గ్రామసభలను తహసీల్దార్ లేకుండా ఏలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. గ్రామసభలు ఇష్టానుసారంగా నిర్వహించొద్దని కోరారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి పెసా గ్రామసభలకు తహసీల్దార్ హాజరయ్యేలా చూడాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బియ్యం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం పస్రా గ్రామానికి చెందిన కృష్ణబాబు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ కార్యకర్తలు బుధవారం పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ. 5వేలు ఆర్థికసాయం అందించడంతో పాటు 50 కేజీల బియ్యం అందించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పాలసీ అండ్ రీసెర్చ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ భూక్య రాజునాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతి, కన్వీనర్ బలరామ్, ఓబీసీ ఇన్‌చర్జ్, మహిళ మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, సత్తిరెడ్డి, అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా ట్రస్టు చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం ఎస్టీ కాలనికి చెందిన రేగ సాగరిక ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ బుధవారం పరామర్శించారు. వైద్య ఖర్చులకు కొంత నగదును ఆర్థిక సాయంగా అందించారు. అదే విధంగా మండల కేంద్రంలోని పొదుమూరుకు చెందిన నాగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందించారు. అనంతరం కోమటిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన తండా సాంబయ్య దశదినకర్మకు హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టు వైస్‌చైర్మన్ బాడిష నవీన్, సభ్యులు ఆదినారాయణ, వీరస్వామి, రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఎస్ఐ మధుసూదన్ సైబర్ నేరాలపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని ఫోన్ నంబర్లను లిఫ్ట్ చేయొద్దని, ఎవరికీ ఓటీపీ చెప్పొద్దని సూచించారు. ఫేస్ బుక్‌లో తెలియని వ్యక్తులతో ఫ్రెండ్షిప్ చేయొద్దని చెప్పారు. ఓఎల్ఎక్స్‌లో వస్తువులను కొనేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అస్లాం జానీ, లాల్‌సింగ్, మమత, మమత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మహదేవపూర్: మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద సైబర్ నేరాలపై పోలీసులు బుధవారం అవగాహన నిర్వహించారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారు ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారని, దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు అకౌంట్ల నుంచి నగదు మాయం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ధనుంజయ్, క్రిష్ణ, విక్రాంత్, ప్రజలు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సమ్మయ్యదొర



నివాళులర్పిస్తున్న నాయకులు

కాటారం: ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారి పక్షాన నిలబడి పోరాడిన యోధుడు కుడిమెత సమ్మయ్యదొర అని ప్రజా సంఘాల నాయకులు గుంటి మల్లయ్య, పీక కిరణ్ అన్నారు. కాటారం మండలం ఆదివారంపేటకు చెందిన తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడిమెత సమ్మయ్యదొర మొదటి వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాసంఘాల నాయకులు సమ్మయ్యదొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీలకు పోడు భూముల హక్కు పత్రాలు ఇవ్వాలని పోరాటం చేయడంతోపాటు అనేక గిరిజన, ఆదివాసీ సమస్యలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి సమ్మయ్యదొర అని కొనియాడారు. శివరాజు, బాపు, మల్లయ్య, గణేశ్ పాల్గొన్నారు.